క్లుప్తంగా

ఎంపీడీఓకి ఘన వీడ్కోలు



బదిలీపై వెళ్తున్న ఎంపీడీఓ కృష్ణమహేష్‌రెడ్డిని సన్మానిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

పాలసముద్రం: బదిలీపై వెళ్లిన ఎంపీడీఓ కృష్ణ మహేష్ రెడ్డికి ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు. సోమవారం ఎంపీడీఓ ఆఫీసులో వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కృష్ణమహేష్‌రెడ్డి మాట్లాడుతూ పాలసముద్రం ఎంపీడీఓగా పని చేస్తున్న తాను గంగాధరనెల్లూరుకు బదిలీపై వెళ్లినట్లు చెప్పారు. కార్యాలయ సిబ్బంది మాట్లాడుతూ ఎంపీడీఓగా కృష్ణమహేష్‌రెడ్డి ప్రజలకు ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి రమేష్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

నివాళి



రజనీకుమార్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న నారాయణస్వామి

కార్వేటినగరం: మండలంలోని గొల్లకంద్రిగ గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రజనీకుమార్ (40) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. సమాచారం అందుకున్న రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి గ్రామానికి వెళ్లి రజనీకుమార్ మృతదేహంపై పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి అంకితభావంతో పార్టీ కోసం పని చేసిన రజనీకుమార్ అకాల మృతి బాధాకరమన్నారు. అలాగే రజనీకుమార్ మృతికి సర్పంచ్ వెంకటేష్, మాజీ సర్పంచ్ విజయులురెడ్డి నివాళి అర్పించారు.

బాధ్యతల స్వీకరణ



కృష్ణమహేష్ రెడ్డి

గంగాధర నెల్లూరు: ఎంపీడీఓగా కృష్ణమహేష్ రెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ సతీష్ పాలసముద్రం మండలానికి బదిలీ కాగా అక్కడ పనిచేస్తున్న కృష్ణమహేష్ రెడ్డి జీడీ నెల్లూరుకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించిన కృష్ణమహేష్ రెడ్డికి అధికారులు, సిబ్బంది స్వాగతం పలికారు.

పాలసముద్రంలో..



సతీష్

పాలసముద్రం: ఎంపీడీఓగా సతీష్ బాధ్యతలు చేపట్టారు. గంగాధరనెల్లూరు నుంచి బదిలీపై వచ్చానని తెలిపారు. నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామని తెలిపారు.

19న మండల మీట్

నగరి: మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ కృష్ణయ్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ భార్గవి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీటీసీ, కో ఆప్షన్ సభ్యులు, సర్పంచ్‌లు, మండలస్థాయి అధికారులు తప్పక హాజరుకావాలన్నారు.

పీఎం సూర్య ఘర్‌పై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఈఈ చంద్రశేఖర్ రావు

రేణిగుంట: ట్రాన్స్‌కో డీఈ కార్యాలయంలో సోమవారం విద్యుత్ సిబ్బంది, వినియోగదారులకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. విద్యుత్ శాఖ నోడల్ ఆఫీసర్, టెక్నికల్ ఈఈ వాసవీలత, ఈఈ చంద్రశేఖర్ రావు, విశ్రాంత ఎస్ఈ దేవేంద్రనాథరెడ్డి, డీఈ రమేష్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంధన ధరలు పెరుగుతున్న నేపథ్యంలో సోలార్ రూఫ్ టాప్ వ్యవస్థలు ఇప్పుడు ఒక చైతన్యాన్ని సృష్టిస్తున్నాయన్నారు. సందేహాలకు టోల్ ఫ్రీ నంబర్ 9440814263లో సంప్రదించాలని కోరారు.

వైభవంగా అగ్నిగుండ ప్రవేశం

వరదయ్యపాళెం: మండలంలోని కోవూరుపాడులో కావమ్మ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందుకు ఆలయ ధర్మకర్త సామర్ల మునెమ్మ, నాగభూషణం ఏర్పాట్లు చేశారు. భక్తులు ముందుగా కంకరణధారణ చేసి ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. తమిళనాడులోని జంగాలపల్లికి చెందిన కళాకారులు అమ్మవారి కథను గానం చేశారు.

మామిడి రైతుల ఘోష



కడుపు మండి మామిడి కాయలను రోడ్డుపై పారబోసిన ఓ రైతు

- కిలోమీటర్ల మేర మామిడి కాయలతో నిలిచిపోయిన ట్రాక్టర్లు
- తిండితిప్పలు మాని మూడు రోజులుగా రోడ్లపైనే రైతన్నలు
- కిలో రూ.8కి కొనాలన్న ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు
- కిలోకి రూ.5 లేదా రూ.6 ఇస్తాం.. ఇష్టమైతే అమ్మండి.. లేకుంటే వెళ్లండంటున్న ఫ్యాక్టరీ యాజమాన్యం
- నడిరోడ్డుపై మామిడి రైతన్నల కంట కన్నీరు

కూటమి ప్రభుత్వం రైతులతో ఆటలాడుకుంటోంది. రైతుల కష్టానికి బాసటగా నిలవాల్సింది పోయి ఫ్యాక్టరీ యాజమాన్యాలతో సరైన పద్ధతుల్లో చర్చలు జరపక, జరిపిన చర్చలను సరిగా అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. దీంతో మామిడి రైతులు రోడ్లపై తిండితిప్పలు మాని పడిగాపులు కాస్తున్నారు. గంగాధర నెల్లూరు మండల కేంద్రంలోని జైన్ మామిడి గుజ్జు పరిశ్రమ వద్దకు దాదాపు 300 నుంచి 400 ట్రాక్టర్లు కిలోమీటర్ల మేర మామిడికాయల లోడుతో నిలిచిపోయాయి.

గంగాధర నెల్లూరు: మామిడి రైతుల బాధలు ప్రభుత్వానికి పట్టడం లేదు. తూతూమంత్రంగా కిలో రూ.8 కొనాలని ఆదేశాలు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఆ ఆదేశాలు సక్రమంగా అమలయ్యేలా చేసి ఉంటే కాస్త అయినా మామిడి రైతులకు లబ్ధి చేకూరేది. ఇప్పుడైనా ప్రభుత్వం ఆదుకుంటుందేమో అని వేచి చూసిన రైతులకు నిరాశే మిగలడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం అవుతున్నాయి. వారం రోజులుగా వందలాది టోకెన్లను సిఫార్సుల మేరకే ఇచ్చుకున్నారని, మామిడి రైతుల నిరసనతో ఫ్యాక్టరీ యాజమాన్యం ఎవరు ముందు వస్తే వారి పంట కొనుగోలు చేస్తామన్న నిర్ణయంతో వందలాది ట్రాక్టర్లతో కిలోమీటర్ల మేర మామిడి రైతులు జైన్ గుజ్జు పరిశ్రమ వద్దకు చేరుకుని నానా అవస్థలు పడుతున్నారు. 13వ తేదీ శుక్రవారం నుంచి అసలు టోకెన్లు జారీ చేయకపోగా కొందరికి మాత్రం సిఫారసు మేరకు లోలోపల టోకెన్లను ఇచ్చినట్లు సమాచారం. దీంతో అవస్థలు పడుతున్న రైతుల ముందే వెనుక వచ్చిన వారు దర్జాగా వెళ్లిపోవడంతో ఆగ్రహజ్వాలలు వ్యక్తం అవుతున్నాయి. గత ప్రభుత్వంలో రూ.30 లేదా రూ.40 మేర మద్దతు ధర ఉన్న మామిడి.. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చాక కేవలం రూ.5 లేదా 6 రూపాయలకే కొనుగోలు చేయడం వెనుక ఫ్యాక్టరీ యాజమానులు, ప్రభుత్వం సిండికేట్‌గా మారాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెండు రోజుల క్రితం వ్యవసాయ శాఖ మంత్రి రూ.8లకే కొనమని చెప్పగా ఏ ఫ్యాక్టరీ యజమాన్యం కూడా ఆ ఆదేశాలను లెక్క చేయడం లేదు. ఇక ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ కథ దేవుడెరుగు అని రైతులు బాహాటంగానే వాపోతున్నారు.



డ్రైవింగ్ సీట్లోనే నిద్రిస్తున్న రైతు



రోడ్లపైనే పడుకున్న రైతులు

మూడు రోజులుగా రోడ్లపైనే



టోకెన్ విధానం రద్దు పరిచి సీరియల్ విధానం అమలులో ఉండగా గత మూడు రోజులుగా రోడ్లపై పడిగాపులు కాస్తున్నాం. తిండి నీరు వసతులు లేక నానా అవస్థలు పడుతున్నాం. కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేదు. సిఫారసులు ఉంటే అన్ లోడింగ్ ముందు పంపిస్తున్నారు. యాజమాన్యం, ప్రభుత్వం అస్సలు పట్టించుకోవడం లేదు.

-యర్రమ రెడ్డి, దాసరపల్లి, పెనుమూరు మండలం

8 + 4 అని చెప్పి..



రాష్ట్ర ప్రభుత్వం మామిడి గుజ్జు ఫ్యాక్టరీ యజమానులతో చర్చలు జరిపి రూ.8 చొప్పున కొనుగోలుకు.. రూ.4 ప్రభుత్వం తరపున అదనంగా అందిస్తాం అన్న మాట ఎక్కడా కార్యరూపం దాల్చలేదు. మా రైతులంతా కన్నీరు కారుస్తున్నా.. కూటమి ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఇష్టముంటే అమ్మండి లేదంటే వెళ్లిపోండి అని బెదిరిస్తున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోరా?

-యుగంధర్ రెడ్డి, పెద్ద మిట్టపల్లి

రైతులు ఎప్పుడు బాగుపడేది ?



మూడు రోజులుగా వేచి ఉన్నా అమ్ముకోలేని మామిడి కాయలు ఒకపక్క, తిండీ నీళ్లు లేక ఇబ్బందులతో మేము ఒక పక్క ఇబ్బంది పడుతున్నాం. కనీస మద్దతు ధర లేక గిట్టుబాటు లేని మామిడి లోడుతో ట్రాక్టర్‌లో వేచి ఉంటున్నాం. రోజుకు ట్రాక్టర్ బాడుగ రూ.3వేలు. ఆరుగాలం కష్టపడిన రైతు ఇంక మిగిలేది ఏముంది ? ఎక్కడ రైతులు బాగుపడేది ?

-సుబ్రమణ్యం నాయుడు, పద్మాపురం

పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమే..



కాయ పక్వానికి వచ్చి 20 రోజులు గడుస్తున్నా.. ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టకపోవడం వల్లే నేడు రైతులు రోడ్ల మీదకు వచ్చారు. మే నెల మొదట్లోనే చర్చలు జరిపి గిట్టుబాటు ధర కల్పించుంటే నేడు ఇంత అవస్థలు పడేవారు కాదు. జిల్లాలో సగానికి పైగా ఫ్యాక్టరీలు ఇంకా తెరుచుకోనే లేదు. నేడు రోడ్లపైకి రైతులు రావడానికి కారణం పూర్తిగా కూటమి ప్రభుత్వమే.

-పురుషోత్తం, సోమనందాపురం

టీడీపీ పొత్తు ధర్మం పాటించడం లేదు

- ఫీల్డ్ అసిస్టెంట్ తొలగింపు అన్యాయం
- ఉంటే కమ్మవాడు ఉండాలి.. అంతేగానీ కాపు కులస్తుడు ఉండకూడదా ?
- నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ యుగంధర్ పొన్న ఆవేదన



మాట్లాడుతున్న నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ యుగంధర్ పొన్న

శ్రీరంగరాజపురం: టీడీపీ నేతలు పొత్తు ధర్మాన్ని పాటించడం లేదు. టీడీపీ నాయకులు కక్ష పూరితంగా ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్‌ను తొలగించడం దారుణమని గంగాధరనెల్లూరు నియోజకవర్గం ఇన్‌చార్జ్ యుగంధర్ పొన్న అన్నారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ 2016 సంవత్సరం నుంచి మండలంలోని కమ్మకంద్రిగ ఫీల్డ్ అసిస్టెంట్‌గా వెంకటేష్ విధులు నిర్వహిస్తున్నాడని, అతని భార్య సుబ్బలక్ష్మి జనసేన పార్టీకి సంబంధించి బ్యానర్‌లో ఫొటో వేయడంతో జీర్ణించుకోలేని టీడీపీ నాయకులు వారి పట్ల కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రోజు నుంచి టీడీపీ నాయకులు దామోదర్ నాయుడు, వెంకటేష్ నాయుడు, మురళి నాయుడు, సోముశేఖర్‌నాయుడు ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేష్‌ను విధులకు రాజీనామా చేయాలని వేధించారని ఆరోపించారు. ఈ పంచాయతీలో ఉంటే కమ్మవాడు ఉండాలి కానీ కాపువాడు మాత్రం ఉండడానికి వీల్లేదని చెప్పారని.. ఇదేనా మీరు పాటించే కూటమి ధర్మం అని ప్రశ్నించారు. మండలంలో 23 పంచాయతీలు ఉంటే అందులో దళితులు, బీసీ, కాపు కులానికి చెందిన వారిని ఐదుగురిని తొలగించడం దారుణమన్నారు. చిన్న ఉద్యోగస్తులు అయిన పేదవాడు కడుపు కొట్టడం న్యాయమేనా ? అని ప్రశ్నించారు. తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను మానవత్వంతో వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్, డ్వామా పీడీ, స్థానిక ఎమ్మెల్యేకి సూచించారు.

21న కౌన్సెలింగ్

సత్యవేడు: పాలిటెక్నిక్ కళాశాలలో అడ్మిషన్ల కోసం 21 నుంచి 28వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందని సత్యవేడు పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ ఉషాదేవి తెలిపారు. రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి తొలిసారిగా సత్యవేడు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు కౌన్సెలింగ్ కేంద్రం కేటాయించిందని తెలిపారు. పాలిసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించి సర్టిఫికెట్లు పరిశీలిస్తామన్నారు. కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ కోసం ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని తెలిపారు. 15 వేల ర్యాంకులోపు విద్యార్థులకు 21న, 32 వేలలోపు ర్యాంకు విద్యార్థులకు 22న, 50 వేల ర్యాంకు పొందిన విద్యార్థులకు 23న, 68 వేలలోపు ర్యాంకు పొందిన వారికి 24న, 86 వేల లోపు ఉన్న వారికి 25న, మిగిలిన వారికి 28వ తేదీ వరకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు తిరుపతి ఎస్వీ పాలిటెక్నిక్ కళాశాలలో జరిగే కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు రెండు సెట్ల జిరాక్సు కాపీలు తీసుకురావాలన్నారు. పాలిసెట్ హాల్ టికెట్, ప్రాసెసింగ్ ఫీజు రసీదు, ర్యాంకు కార్డు, 10వ తరగతి మార్కుల లిస్టు, 4 నుంచి 10వ తరగతి వరకు చదివిన స్టడీ సర్టిఫికెట్లు, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, కులధ్రువీకరణ పత్రం, టీసీ, ఆధార్ కార్డు తీసుకురావాలన్నారు.

ప్రజా సమస్యల వినతులపై దృష్టి పెట్టండి



ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న తహసీల్దార్ లోకనాథపిళ్లై

శ్రీరంగరాజపురం: ప్రజలు అందించే వినతులపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తహసీల్దార్ లోకనాథపిళ్లై అన్నారు. సోమవారం కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 21 వినతులు వచ్చాయి. అందులో మ్యుటేషన్ 12, శ్మశానానికి దారి 1, భూసర్వే 3, ఇంటి నిర్మాణానికి పొజిషన్ పట్టా మంజూరు చేయాలని 2, పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని 2, ఇతరుల ఆక్రమణలో భూమిని తొలగించి హద్దులు చూపించాలని 1 వంటి సమస్యలు అందాయన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజల నుంచి వచ్చే సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. రెవెన్యూ సమస్యలు, ధ్రువపత్రాల మంజూరులో జాప్యం లేకుండా చూడాలని ఆదేశించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, అర్జీదారులు పాల్గొన్నారు.

మణి స్వామి ఇక లేరు



మణి స్వామి

నగరి: మున్సిపల్ పరిధిలోని కీళపట్టు చంద్రమౌళీశ్వర స్వామి ఆలయ అభివృద్ధిలో ప్రధాన పాత్ర పోషించి స్థానికులు అందరిచేత మణిస్వామిగా గుర్తింపు పొందిన జనకళ్యాణ సుబ్రమణి స్వామి ఆదివారం కాశీలో గుండెపోటుతో మృతి చెందారు. ఈ విషయం సోమవారం తెలియడంతో కీళపట్టు గ్రామస్తులు తీవ్ర ఆవేదనకు లోనయ్యారు. చెన్నై పెరంబూరుకు చెందిన మణిస్వామి పాడుబడి పిచ్చిమొక్కలతో నిండిన కీళపట్టు చంద్రమౌళీశ్వర ఆలయం విశిష్టతను తెలుసుకుని ఆలయానికి పూర్వవైభవం తీసుకురావడంలో తనవంతు పాత్ర పోషించారు. నెలకు నాలుగైదు సార్లు చెన్నై నుంచి ఆలయానికి విచ్చేస్తూ దాతలతో సంప్రదిస్తూ వారి సహకారం తీసుకుంటూ ఆలయాన్ని అభివృద్ధి చేశారు. అలాగే పీఠాధిపతులను, స్వామీజీలను ఆలయానికి తీసుకువచ్చి ఆలయ కీర్తిని మరింత ఇనుమడింపజేశారు. కాశీ యాత్రకు వెళ్లిన ఆయన గుండెపోటుతో అక్కడే మృతిచెందారు. స్థానికులు ఆలయం వద్ద మోక్ష దీపం వెలిగించి ఆయన ఆత్మశాంతికి వేడుకున్నారు.



గుక్కెడు నీళ్లివ్వండి సామీ..

నీళ్ల బిందెలతో నిరసన తెలుపుతున్న మహిళలు

మూడు రోజులుగా తాగడానికి నీళ్లు లేవు.. ఇంటి అవసరాలకు, స్నానం చేద్దామంటే నీళ్లు రావట్లేదు.. ఎట్లా ఉండాలి మేము.. గుక్కెడు నీళ్లివ్వండి సామీ మీకు దండం పెడతా అంటూ మహిళలు వాపోయారు. గంగాధరనెల్లూరు మండలంలోని నెల్లేపల్లి పంచాయతీ లక్ష్మీరెడ్డిపల్లి దళితవాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని స్థానిక మహిళలు సోమవారం రోడ్డెక్కారు. గత మూడు రోజులుగా తమ గ్రామంలో తాగునీటికి, ఇంటి అవసరాలకు, స్నానానికి కూడా నీరు లేదని వాపోయారు. తక్షణం నీరు వచ్చేలా చేయాలని కోరుతూ నీళ్ల బిందెలతో రోడ్డుపై నిరసన తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి సత్వర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

-గంగాధర నెల్లూరు

పొలంలోకి దూసుకెళ్లిన కారు



పొలంలోకి దూసుకెళ్లిన కారు

నాగలాపురం: పిచ్చాటూరు మండలంలోని జేబీఆర్ కళాశాల వద్ద సోమవారం పుత్తూరు–చెన్నై బైపాసు రోడ్డులో వెళుతున్న కారు ఉన్నట్టుండి పొలంలోకి దూసుకెళ్లింది. పోలీసుల కథనం మేరకు.. పిచ్చాటూరు మండలంలోని టీచర్స్ కాలనీకి చెందిన విశ్వనాథ్ సొంత పనుల నిమిత్తం కారులో అప్పంబేడుకు బయలుదేరాడు. జేబీఆర్ కళాశాల వద్ద కారు బ్రేక్ ఫెయిల్ అయి అదుపుతప్పి పొలంలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్నవారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ వెంకటేశులు తెలిపారు.



ఎస్‌బీఆర్‌పురం నుంచి టిప్పర్‌లో గ్రావెల్ తరలిస్తున్న దృశ్యం

మట్టి.. కొల్లగొట్టి..

వడమాలపేట (విజయపురం): అక్రమాలకు కాదేదీ అనర్హం అన్నట్టు అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రకృతి సంపద అయిన కొండలు, గుట్టలు, వంకలు, వాగులు, చెరువులు ఇలా దేన్నీ వదలడం లేదు. సులువుగా డబ్బు సంపాదించే ఆలోచనతో ప్రకృతి వనరులను కొల్లగొడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అక్రమాలకు అంతే లేకుండా పోయింది. ఎక్కడ మట్టి దొరికితే అక్కడ తవ్వేస్తున్నారు. సోమవారం వడమాలపేట మండలం ఎస్‌బీఆర్‌పురం సమీపంలోని కొండల నుంచి మట్టిని వెంచర్లకు భారీగా తరలించారు. దీనిపై స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. టిప్పర్లలో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటున్నా.. అధికారులు మాత్రం అన్నీ తెలిసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాత్రి, పగలు తేడా లేకుండా మట్టిని తరలిస్తున్నారు. జిల్లాస్థాయి అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

భద్రతా నియమాలు పాటించకుంటే చర్యలు



రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ రవికుమార్, ఎంవీఐ చంద్రశేఖర్



స్కూల్ బసులను తనిఖీ చేస్తున్న ఎస్ఐ ధర్మారెడ్డి

పుత్తూరు: రహదారి భద్రతా నియమాలు పాటించని స్కూల్, కళాశాల యాజమాన్యాలపై కఠిన చర్యలు తప్పవని స్థానిక డీఎస్పీ రవికుమార్, ఎంవీఐ చంద్రశేఖర్ హెచ్చరించారు. సోమవారం పుత్తూరు పట్టణంలో పలు ప్రైవేటు బస్సులు, వ్యాన్లను పోలీసు, రవాణా శాఖ అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఎంవీఐ చంద్రశేఖర్ మాట్లాడుతూ ఫిట్‌నెస్ లేని వాహనాలను నడిపినా, సామర్థ్యానికి మించి విద్యార్థులను రవాణా చేసినా, అధిక వేగంగా నడిపినా, రహదారి భద్రతా నియమాలు పాటించకున్నా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సెంట్రల్ మోటార్ వెహికల్ రూల్స్ 1989లోని రూల్ 185(జి) ప్రకారం స్కూల్ బస్సులు నిర్వహించడానికి పొందు పరచిన అన్ని నిబంధనలను అన్ని స్కూల్, కళాశాల యాజమాన్యాలు విధిగా పాటించాలని స్పష్టం చేశారు. విచక్షణా రహితంగా వాహనాలను నడిపే డ్రైవర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని తెలిపారు. వీరి నిర్లక్ష్యం కారణంగానే విద్యార్థులు ప్రమాదాలకు గురవుతుంటారని, దీన్ని నియంత్రించడానికి స్కూల్ యాజమాన్యాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత స్కూల్, కళాశాల యాజమాన్యాలదేనని స్పష్టం చేశారు.

స్కూల్ బస్సుల తనిఖీ

వడమాలపేట (విజయపురం): వడమాలపేట మండలంలోని ప్రైవేటు స్కూల్ బస్సులను ఎస్ఐ ధర్మారెడ్డి సోమవారం తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పిల్లల్ని స్కూల్ నుంచి ఇంటికి జాగ్రత్తగా తీసుకెళ్లాలని డ్రైవర్లకు సూచించారు. బస్సుల్లో ఎమర్జెన్సీ ఎగ్జిట్, ఫస్ట్ ఎయిడ్ బాక్స్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే డ్రైవర్, క్లీనర్ ఎట్టి పరిస్థితుల్లో మద్యం తాగి డ్రైవింగ్ చేయవద్దని, స్కూల్ బస్సులకు సంబంధించిన ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఆర్సీ, ఇన్సూరెన్స్ ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవా లని సూచించారు. కాలం చెల్లిన బస్సులు నడిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

సామూహిక అక్షరాభ్యాసం రేపు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయంలో బుధవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించనున్నట్లు ఈఓ బాపిరెడ్డి తెలిపారు. మేధా గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద ఉదయం 9 గంటలకు అక్షరాభ్యాసం కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. చిన్నారుల తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.